

**హిమాలయ పర్వత సానువులు ఎన్నో అద్భుతాలకు ఆలవాలం. బంగారమంటి కుంకుమ పువ్వు మాత్రమే కాదు, బంగారం కన్నా ఖరీదైన ఓ ప్రత్యేక రకం మూలికకూ అది నెలవు. హిమాలయన్ గోల్డ్, హిమాలయన్ వయాగ్రాగా పిలిచే ఈ క్యాటర్ పిల్లర్ ఫంగస్, యవ్వనాన్ని నిలిపి ఉంచి, లైంగిక సామర్థ్యాన్ని పెంచుతుందట. సంప్రదాయ వైద్యంలో పేరు పొందిన దీన్ని తెచ్చేందుకు వేసవి నెలల్లో ఆ చుట్టు పక్కల జనం పర్వతాల మీద వేల అడుగుల ఎత్తుకు చేరుకుంటారు.**



# హిమాలయన్ వయాగ్రా... బంగారం కన్నా ఖరీదు!

ఏప్రిల్, మే నెలలు ప్రారంభం కాగానే హిమగిరుల చుట్టు పక్కల ఉన్న జనం బంగారం వేటకు సన్నద్ధమవుతారు. శాస్త్ర పరిభాషలో అఫియో కార్డిసెప్స్ సినెన్సిస్‌గా పిలిచే ఈ మూలిక సగం చెట్టు-సగం పురుగు. అందుకే క్యాటర్ పిల్లర్ ఫంగస్ అనీ అంటారు. సముద్రమట్టానికి 15 వేల అడుగుల ఎత్తున హిమాలయ పర్వత సానువుల్లోని నేల లోపల చిన్న సైజులో ఉండే గొంగళి జాతి పురుగులు తిరుగుతుంటాయి. అక్కడి మంచు, వానల వల్ల దాని శరీరంలోకి కార్డిసెప్స్ మష్రూమ్ బీజాలు చొచ్చుకుపోతాయి. ఆ ఫంగస్ క్రమక్రమంగా పెరిగి పురుగు శరీరం మొత్తాన్నీ ఆక్రమించేస్తుంది. అది చనిపోయాక దాని తలను చీల్చుకుని దబ్బనమంత సైజులో సన్నటి పుట్టగొడుగు భూమిని చీల్చుకుంటూ బయటకు వస్తుంది. దీన్నే హిమాలయాల చుట్టూ ఉండే భారత్, నేపాల్, టిబెట్, చైనా తదితర దేశాల ప్రజలు వేల సంఖ్యలో వెతుకుతూ ఉంటారు. దీని కోసమే అంత ఎత్తుకు ఎక్కి ఏప్రిల్ నుంచి జూన్ దాకా గుడారాలు వేసుకుని అక్కడే ఉండి, గడ్డిలో నుంచి వీటిని ఏరి సంపాదిస్తుంటారు.

**దివ్య ఔషధం...**

పదిహేను వందల ఏండ్ల క్రితం ఇటుగా జడల బర్రెలతో ప్రయాణాలు సాగించేవారట. అవి ఎత్తులు ఎక్కి ఎంతో అలసిపోయినా, ఈ ప్రాంతంలో గడ్డి తిన్నాక విపరీతంగా ఉత్సాహంగా తయారయ్యేవట. అంతేకాదు, జబ్బు పడ్డ జీవులు సైతం ఇక్కడి గడ్డి తిన్నాక బాగా కోలుకోవడాన్ని గమనించారట యజమానులు. విషయమేంటా అని వెతికితే బయట పడిందే ఈ పుట్టగొడుగు జాతి మూలిక. అప్పటి నుంచి ఆ చుట్టు పక్కల ఉండే రాజ కుటుంబీలకు మాత్రమే దాన్ని పరిమితం చేసినా, క్రమేణా చైనా తదితర దేశాల సంప్రదాయ వైద్యంలో దాని ప్రాధాన్యం విపరీతంగా పెరిగింది. ఇది ఇమ్యూనిటీని పెంచుతుందట. కాలేయం, ఊపిరితిత్తులు, నరాల సమస్యలకు సంబంధించిన వ్యాధుల చికిత్సల కోసమూ వాడతారు. ఇందులో యాంటి వైరల్, యాంటి క్యాన్సర్ గుణాలు అధికం. లైంగిక సామర్థ్యాన్ని పెంచడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుందని అంటుంది చైనీస్ సంప్రదాయ వైద్యం. అందుకే ప్రకృతి ఇచ్చిన సహజ సిద్ధ వయాగ్రాగా దీన్ని చెబుతారు. యవ్వనాన్ని నిలిపి ఉంచేందుకూ ఇది దివ్యౌషధంలా పనిచేస్తుందట. వీటన్నింటి కారణంగా ముఖ్యంగా హాంకాంగ్, చైనాల్లో ఈ మూలికకు విపరీతమైన డిమాండ్ ఉంది. గతేడాది అంతర్జాతీయ మార్కెట్లో కిలో ధర 93 లక్షల రూపాయల పైచిలుకే పలికిందంటే దాని పవర్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, దీనికి సంబంధించిన అనేక సంగతుల్ని తెలుపుతూ హిమాలయన్ గోల్డ్ రష్ పేరిట డాక్యుమెంటరీ కూడా తీశారు. ప్రకృతిలో ఎన్ని చిత్రాలో కదూ!











